navajyothidaily.com

# నవజ్యోతి

తెలుగు దినపత్రిక

ప్రచురణ : తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | ఆదివారం, 13 సెప్టెంబరు 2026 | ఎడిటర్ : మన్నె లక్ష్మణ్ | సంపుటి : 1 సంచిక : 322 | పేజీలు : 8 | వెల : 5/-



2లో..

ప్రతిపక్షాలు

అహంకారం వీడాలి : రేవంత్



2లో..

కేసీఆర్‌తోనే తెలంగాణ

వ్యవసాయ ప్రగతి



ఆదిలాబాద్ విమానాశ్రయానికి

## గ్రీన్ సిగ్నల్

- ప్రాజెక్టు పనులు వేగవంతం: కిషన్ రెడ్డి
- రక్షణ శాఖ పూర్తి సహకారం అందిస్తోందని వెల్లడి
- అదనంగా 1,500 ఎకరాల భూసేకరణకు చర్యలు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి 2లో..

మాక్ అసెంబ్లీలో రేవంత్‌పై

## బీఆర్ఎస్ విమర్శలు

ఎమ్మెల్యేల సస్పెన్షన్‌కు నిరసనగా

తెలంగాణ భవన్‌లో కార్యక్రమం

ప్రభుత్వ హామీలు, పాలనపై వ్యంగ్యాస్త్రాలు

ప్రజా సమస్యలపై చర్చకు అవకాశం ఇవ్వలేదని ఆరోపణ 2లో..



# గణేశ్ ఉత్సవాలపై.. సీఎం సమీక్ష

మున్సిపల్, పోలీసు శాఖల సమన్వయంపై ఆదేశాలు

- పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు, నియంత్రణ కేంద్రం ఏర్పాటు
- శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచన
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి) :** హైదరాబాద్ మహానగరంలో గణేశ్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా, విజయవంతంగా జరిగేలా మున్సిపల్, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గణేశ్ ఉత్సవాలు ముగిసే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఉత్సవాల సమన్వయం, పర్యవేక్షణ కోసం ప్రత్యేక అధికారులను నియమించాలని అధికారులకు స్పష్టం చేశారు. శాసనసభ ఆవరణలోని మండలి సమావేశ మందిరంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో గణేశ్ ఉత్సవాల ఏర్పాట్లపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, నగర ప్రజాప్రతినిధులు, మున్సిపల్, పోలీసు శాఖల ఉన్నతాధికారులు, గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. గణేశ్ ఉత్సవాల పర్యవేక్షణ కోసం సమీకృత నియంత్రణ కేంద్రంలో ప్రత్యేక నియంత్రణ గదిని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. హైదరాబాద్ నగరం ప్రశాంతంగా ఉన్నప్పుడే పెట్టుబడులు, అభివృద్ధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గణేశ్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు సాఫీగా సాగేందుకు నిర్వాహకులు కూడా పూర్తి సహకారం అందించాలని ముఖ్యమంత్రి కోరారు. ఉత్సవాలకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. నిర్వాహకుల సమస్యలను స్వయంగా తెలుసుకోవడానికే ఈ సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. (మిగతా.. 2లో)

## మలేషియా ప్రధాని అన్వర్‌తో మోదీ భేటీ

సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంపై చర్చలు

సెమీకండక్టర్లు, స్వచ్ఛ ఇంధన రంగాల్లో సహకారానికి ప్రాధాన్యం

రక్షణ, పెట్టుబడుల బలోపేతంపై సమాలోచనలు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి) :** భారత ప్రధాని నరేంద్ర మోదీ మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో సమావేశమై ఇరు దేశాల మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై చర్చించారు. ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తరించడంతో పాటు పరస్పర ప్రయోజనకర రంగాల్లో సహకారాన్ని పెంపొందించడంపై ఇరు నేతలు విస్తృతంగా అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ భేటీ భారత్-మలేషియా సంబంధాలకు కొత్త ఊపునిచ్చే అవకాశంగా భావిస్తున్నారు. సమావేశంలో సెమీకండక్టర్ల తయారీ, కీలక ఖనిజ వనరులు, స్వచ్ఛ ఇంధన రంగాల్లో భాగస్వామ్యాన్ని విస్తరించే అంశాలపై ప్రధానంగా చర్చించారు. ప్రపంచ సరఫరా గొలుసుల్లో పెరుగుతున్న సవాళ్ల నేపథ్యంలో పరస్పర సహకారం ద్వారా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఇరు దేశాలు అభిప్రాయ పడ్డాయి. ఆధునిక సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ (మిగతా.. 2లో)

బొంగునూరి జనార్ధన్ రెడ్డి మృతి పట్ల

## పవన్ కళ్యాణ్ సంతాపం

జనసేన ఉపాధ్యక్షుడు మహేందర్ రెడ్డి సోదరుడి మృతి పట్ల దిగ్భ్రాంతి

కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన పవన్ కళ్యాణ్

ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థన





బ్రిక్స్ స్మారక తపాలా బిళ్లలు

## విడుదల చేసిన మోదీ

బ్రిక్స్ రెండు దశాబ్దాల ప్రయాణానికి ప్రత్యేక గుర్తింపు

18వ బ్రిక్స్ సదస్సు సందర్భంగా ఆవిష్కరణ

స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారానికి ప్రతీకగా రూపకల్పన

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి):** బ్రిక్స్ సంస్థ ఏర్పడి రెండు దశాబ్దాలు పూర్తైన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు ప్రత్యేక స్మారక తపాలా బిళ్లలను విడుదల చేశారు. న్యూఢిల్లీలో జరుగుతున్న 18వ బ్రిక్స్ సదస్సు వేదికగా ఈ బిళ్లలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సంభాషణ, సహకారం, భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో బ్రిక్స్ కీలక వేదికగా ఎదిగిందన్నారు. గత ఇరవై ఏళ్లలో బ్రిక్స్ సంస్థ ప్రపంచ ఆర్థిక, సామాజిక, వ్యూహాత్మక అంశాల్లో ప్రభావవంతమైన పాత్ర పోషించిందని పేర్కొన్నారు. (మిగతా.. 2లో)

# తెలంగాణలో వర్షాల హెచ్చరిక

- మరో వారం రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం
- పలు జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్షాల హెచ్చరిక
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య శాఖ సూచన



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి)** తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశాలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల ప్రభావంతో నదులు, వాగులు, చెరువుల్లో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అటవీ ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. వర్షాల కారణంగా రహదారులు దెబ్బతినడం, రాకపోకలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని హెచ్చరించారు. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పంట పొలాల్లో నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని (మిగతా.. 2లో)

## తెలంగాణలో భయానక పాలన

సాగుతుంది : సబితా ఇంద్రారెడ్డి

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపణ

మహిళలపై నేరాలు పెరుగుతున్నాయంటూ విమర్శ

మాక్ అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తిన మాజీ మంత్రి 2లో



నవజ్యోతి తెలుగు దినపత్రిక navajyothidaily.com



# తెలంగాణలో వర్షాల హెచ్చరిక


(మొదటి పేజీ తరువాయి..)

వ్యవసాయ శాఖ కూడా రైతులకు సూచనలు జారీ చేసింది. ఇక నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. హైదరాబాద్ నగరంలో కూడా మోస్తరు వర్షాలు పడే సూచనలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. నగరంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నందున అవసరమైతేనే బయటకు రావాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో రాష్ట్ర ప్రజారోగ్య శాఖ ప్రజలకు కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని పేర్కొంది. ముఖ్యంగా దోమల ద్వారా, కలుషిత నీటి ద్వారా, గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించింది. పిల్లలు, వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు తెలిపారు. దోమతెరలు వినియోగించడం, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడడం, కాచి చల్లార్చిన నీటినే తాగడం వంటి ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని ఆరోగ్య శాఖ కోరింది. జ్వరం, దగ్గు, జలుబు, శ్వాస సంబంధిత సమస్యలు లేదా ఫ్లూ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప వైద్య కేంద్రాన్ని సంప్రదించాలని అధికారులు సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటే వర్షాకాలంలో వ్యాధుల బారిన పడకుండా సురక్షితంగా ఉండవచ్చని ఆరోగ్య శాఖ స్పష్టం చేసింది.

# ప్రతిపక్షాలు అహంకారం వీడాలి : రేవంత్

### శాసనసభలో ప్రతిపక్షాలపై ముఖ్యమంత్రి విమర్శలు

### అధికారం పోయినా అహంకారం తగ్గలేదని వ్యాఖ్య



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి)** శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. అధికారం కోల్పోయినప్పటికీ అహంకారం మాత్రం తగ్గలేదంటూ ఆయన విమర్శలు గుప్పించారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య జరిగిన చర్చ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. "అధికారం పోయింది... కానీ అహంకారం పోలేదు" అంటూ రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా అహంకారం వదులుకోవాలని సూచించారు. ప్రజల తీర్పును గౌరవించి రాజకీయంగా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన చమత్కార వ్యాఖ్యలు కూడా చేశారు. "మన ఊర్లలో అయితే వేపాకులతో కొడతారు అధ్యక్షా" అంటూ సభలో నవ్వులు పూయించారు. తనదైన శైలిలో చేసిన ఈ వ్యాఖ్యలు సభ్యుల దృష్టిని ఆకర్షించాయి. మరోసారి మాట్లాడుతూ పోలేపల్లి జాతరకు తీసుకెళ్లి కొట్టాలా అని సరదాగా వ్యాఖ్యానించారు. అలాంటి పరిస్థితుల్లోనైనా జ్ఞానోదయం కలుగుతుందేమో అంటూ చేసిన వ్యాఖ్యలు సభలో నవ్వులు తెప్పించాయి. ఈ వ్యాఖ్యలపై అధికార పక్ష సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. సభలో జరిగిన చర్చల సందర్భంగా అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య పలుమార్లు వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు సభలో ప్రధాన చర్చగా మారాయి. రాజకీయ పరిణామాలు, ప్రజల తీర్పుపై కూడా ఆయన ప్రస్తావించారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. అధికార పక్షం వాటిని సమర్థిస్తుండగా, ప్రతిపక్షాలు తమదైన రీతిలో స్పందిస్తున్నాయి. శాసనసభ సమావేశాల్లో చోటుచేసుకున్న ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు కారణమయ్యాయి.

# గణేశ్ ఉత్సవాలపై సీఎం సమీక్ష

(మొదటి పేజీ తరువాయి..)

గణేశ్ మండపాలకు అతిథులను ఆహ్వానించే సందర్భాల్లో ఆ వివరాలను స్థానిక పోలీసు అధికారులకు ముందుగానే అందించాలని ముఖ్యమంత్రి సూచించారు. ఎక్కడెక్కడ మండపాలు ఏర్పాటు చేస్తున్నారో ముందస్తుగా సమాచారం అందితే ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు వీలవుతుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, నిర్వాహకులు సంబంధిత అధికారుల వద్ద దరఖాస్తు చేసుకుని ఆ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమాలు సజావుగా జరిగేలా చెరువుల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలను ముందుగానే ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రక్రియ వేగంగా పూర్తయ్యేందుకు చెరువుల వద్ద క్రేన్లు ఏర్పాటు చేయడానికి అనువైన ప్రత్యేక వసతులు కల్పించాలని సూచించారు. గణేశ్ ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# బ్రిక్స్ స్మారక తపాలా బిళ్లలు విడుదల చేసిన మోదీ

(మొదటి పేజీ తరువాయి..)




విడుదల చేసిన స్మారక తపాలా బిళ్లు బ్రిక్స్ ప్రయాణాన్ని, సభ్య దేశాల ఉమ్మడి లక్ష్యాలను ప్రతిబింబిస్తున్నాయని మోదీ తెలిపారు. భారత్ చేపట్టిన బ్రిక్స్-2026 అధ్యక్ష బాధ్యతల ప్రధాన అంశాలైన స్థిరత్వ నిర్మాణం, ఆవిష్కరణలు, సహకారం, సుస్థిర అభివృద్ధిని ఈ బిళ్లల్లో ప్రతిష్ఠాత్మకంగా ఆవిష్కరించినట్లు చెప్పారు. "స్థిరత్వం, ఆవిష్కరణ, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం" అనే అంశంతో భారత అధ్యక్ష బాధ్యతలు కొనసాగుతున్నాయని, ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు సభ్య దేశాలు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని ప్రధాని పేర్కొన్నారు. బ్రిక్స్ దేశాల మధ్య పరస్పర విశ్వాసం, భాగస్వామ్యం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ తపాలా బిళ్లు కేవలం స్మారక చిహ్నాలు మాత్రమే కాకుండా, బ్రిక్స్ దేశాల ఉమ్మడి సంకల్పానికి ప్రతీకలుగా నిలుస్తాయని మోదీ అన్నారు. భావితరాలకు సహకారం, అభివృద్ధి, సుస్థిరత సందేశాన్ని ఇవి అందిస్తాయని తెలిపారు. 18వ బ్రిక్స్ సదస్సులో భాగంగా విడుదలైన ఈ స్మారక తపాలా బిళ్లు సభ్య దేశాల మధ్య ఐక్యతను, అభివృద్ధి లక్ష్యాల పట్ల ఉన్న నిబద్ధతను ప్రతిబింబిస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. బ్రిక్స్ సహకారాన్ని మరింత విస్తరించేందుకు భారత్ కట్టుబడి ఉందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

# మలేషియా ప్రధాని అన్వర్‌తో మోదీ భేటీ

(మొదటి పేజీ తరువాయి..)

అవసరమని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం, ఆర్థిక సహకార విస్తరణపై కూడా చర్చలు జరిగాయి. ఇరు దేశాల వ్యాపార వర్గాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడం ద్వారా వాణిజ్య అవకాశాలను పెంచే దిశగా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. పెట్టుబడుల ప్రవాహాన్ని ప్రోత్సహించేందుకు అనుకూల వాతావరణం కల్పించడంపై కూడా సమాలోచనలు జరిగాయి. ప్రతిభావంతులైన మానవ వనరుల చలనం, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో సహకారాన్ని పెంచే అంశం కూడా సమావేశంలో ప్రాధాన్యం పొందింది. విద్య, ఉపాధి, సాంకేతిక శిక్షణ రంగాల్లో పరస్పర భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం ద్వారా యువతకు మరిన్ని అవకాశాలు కల్పించవచ్చని ఇరు నేతలు అభిప్రాయపడ్డారు. ఈ రంగాల్లో సంయుక్త కార్యక్రమాలు చేపట్టే అవకాశాలను పరిశీలించారు. రక్షణ రంగ సహకారాన్ని మరింత బలోపేతం చేయడంపై కూడా చర్చలు జరిగాయి. ప్రాంతీయ భద్రత, సముద్ర భద్రత, వ్యూహాత్మక అంశాల్లో పరస్పర సమన్వయాన్ని పెంచుకోవాల్సిన అవసరాన్ని ఇరు నాయకులు గుర్తించారు. భద్రతా రంగంలో సమాచార మార్పిడి, శిక్షణ కార్యక్రమాలు, సాంకేతిక సహకారాన్ని విస్తరించేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. భారత్, మలేషియా మధ్య ఉన్న సుదీర్ఘ స్నేహపూర్వక సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఇరు దేశాలు కట్టుబడి ఉన్నట్లు సమావేశం అనంతరం వెల్లడించారు. సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం ద్వారా ఆర్థిక, సాంకేతిక, రక్షణ రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ భేటీ ఇరు దేశాల మధ్య సహకారానికి మరింత బలమైన పునాది వేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# తెలంగాణలో భయానక పాలన సాగుతుంది : సబితా ఇంద్రారెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి) :** తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి రాష్ట్రంలోని శాంతిభద్రతల పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ముందు ఇటీవల చోటుచేసుకున్న సంఘటనను ప్రస్తావిస్తూ తాను కొంత బాధతోనే మాట్లాడుతున్నానని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నట్టుగా రాష్ట్రంలో ప్రజా పాలన లేదని, ప్రస్తుతం భయానక పాలన కొనసాగుతోందని ఆరోపించారు. ప్రజల్లో భద్రతాభావం తగ్గిపోతుండడం ఆందోళనకరమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మిస్సింగ్ కేసులు, అత్యాచారాలు, ఇతర నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న ఘటనలు సమాజాన్ని కలవరపెడుతున్నాయని చెప్పారు. నేరాలను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, చట్టవ్యవస్థపై ప్రజలకు నమ్మకం తగ్గే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆమె పేర్కొన్నారు. జాతీయ నేర గణాంకాల బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నివేదికను ప్రస్తావిస్తూ దేశవ్యాప్తంగా నేరాల రేటులో తెలంగాణ మూడో స్థానంలో ఉందని ఆమె చెప్పారు. ఈ గణాంకాలే రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలియజేస్తున్నాయని వ్యాఖ్యానించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన ప్రభుత్వం ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. మహిళలపై జరుగుతున్న నేరాల విషయంలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలవడం అత్యంత ఆందోళనకర విషయమని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఫలితాలు ఇవ్వడం లేదని విమర్శించారు. మహిళలు నిర్భయంగా జీవించే పరిస్థితులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకుంటోందని సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కంటే రాజకీయ ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై ప్రభుత్వం సమగ్ర సమీక్ష నిర్వహించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. మాక్ అసెంబ్లీ వేదికగా మాట్లాడిన సబితా ఇంద్రారెడ్డి, తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న భద్రతా సమస్యలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. మహిళలపై నేరాలు, మిస్సింగ్ కేసులు, ఇతర నేరాల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల భద్రతను పరిరక్షించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని, ఆ బాధ్యతను నిర్వర్తించాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు.

# మాక్ అసెంబ్లీలో రేవంత్‌పై బీఆర్ఎస్ విమర్శలు




**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి):** అసెంబ్లీ నుంచి తమ పార్టీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై పార్టీ నేతలు తీవ్ర విమర్శలు గుప్పించారు. మాక్ అసెంబ్లీలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు స్పీకర్ పాత్ర పోషించగా, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్యమంత్రి పాత్రలో పాల్గొని వ్యంగ్య ప్రసంగం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలు, రాజకీయ పరిణామాలపై ఆయన విమర్శలు చేశారు. ఇటీవల మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన అంశాన్ని ప్రస్తావిస్తూ తలసాని వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. అలాగే కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఇంకా అమలు కాలేదని ఆరోపిస్తూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించా రు. అసెంబ్లీలో మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల ప్రవర్తన, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్యంపై చేసిన వ్యాఖ్యల అంశాలపై చర్చకు అవకాశం ఇవ్వాలని కోరినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ అంశాలపై పట్టుబట్టిన నేపథ్యంలో కేటీఆర్ సహా 22 మంది ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేల సస్పెన్షన్‌ను ప్రజాస్వామ్య విరుద్ధ చర్యగా అభివర్ణించిన బీఆర్ఎస్ నేతలు, ప్రజా సమస్యలపై చర్చకు ప్రభుత్వం దూరంగా ఉంటోందని విమర్శించారు. అసెంబ్లీలో చర్చించలేని అంశాలను ప్రజల ముందుకు తీసుకువచ్చేందుకే మాక్ అసెంబ్లీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేటీఆర్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ప్రజా సమస్యలకు సంబంధించిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేసిన నేతలు, ప్రభుత్వం ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు.

# బొంగునూరి జనార్ధన్ రెడ్డి మృతి పట్ల పవన్ కళ్యాణ్ సంతాపం



**అమరావతి, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి)** టీటీడీ పాలక మండలి సభ్యుడు, జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు బొంగునూరి మహేందర్ రెడ్డి సోదరుడు బొంగునూరి జనార్ధన్ రెడ్డి అకాల మరణం పట్ల ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మృతి వార్త తనను కలచివేసిందని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. బొంగునూరి జనార్ధన్ రెడ్డి మృతి బొంగునూరి కుటుంబానికి తీరని లోటని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యం పొందాలని ఆకాంక్షించారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. జనార్ధన్ రెడ్డి సమాజంతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్న వ్యక్తిగా గుర్తింపు పొందారని పవన్ కళ్యాణ్ అన్నారు. ఆయన అకాల మరణం కుటుంబ సభ్యులతో పాటు స్నేహితులు, బంధువులకు కూడా తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని పేర్కొన్నారు. ఈ నష్టం అందరికీ బాధాకరమని తెలిపారు. మరణించిన జనార్ధన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పవన్ కళ్యాణ్ వెల్లడించారు. కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని భరించే శక్తిని ప్రసాదించాలని కోరుకున్నారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. బొంగునూరి మహేందర్ రెడ్డి జనసేన పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకుడిగా, అలాగే టీటీడీ పాలక మండలి సభ్యుడిగా సేవలందిస్తున్నారని రాజకీయ వర్గాలు పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో జనార్ధన్ రెడ్డి మృతి పట్ల పలువురు రాజకీయ, సామాజిక రంగ ప్రముఖులు కూడా సంతాపం వ్యక్తం చేస్తున్నారు. జనార్ధన్ రెడ్డి మృతి వార్త తెలిసిన అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ముందుకు వస్తున్నారు. బంధువులు, స్నేహితులు, అభిమానులు పెద్ద సంఖ్యలో సంతాపం తెలియజేస్తున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

# కేసీఆర్‌తోనే తెలంగాణ వ్యవసాయ ప్రగతి

- బీఆర్ఎస్ పాలనలో సాగు విస్తీర్ణం పెరిగిందన్న జగదీశ్ రెడ్డి
- మిషన్ కాకతీయ, మిషన్ భగీరథతో గ్రామీణాభివృద్ధి జరిగిందని వ్యాఖ్య
- కాళేశ్వరం ద్వారా సూర్యాపేటకు గోదావరి జలాలు చేరాయని వెల్లడి



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి)** తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం సాధించిన అభివృద్ధిని ప్రస్తావించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యం కల్పించారని, రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేశారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర అభివృద్ధి, ముఖ్యంగా వ్యవసాయ రంగంలో నమోదైన పురోగతి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందని ఆయన అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ హయాంలో రెండు కోట్ల ఎకరాలకు పైగా భూమిని సాగులోకి తీసుకురావడంలో కేసీఆర్ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని జగదీశ్ రెడ్డి తెలిపారు. సాగునీటి వసతుల విస్తరణ, రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా, వ్యవసాయ అనుకూల విధానాల అమలు కారణంగా పంటల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు. రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు వ్యవసాయ రంగానికి వెన్నుదన్నుగా నిలిచాయని పేర్కొన్నారు. మిషన్ కాకతీయ కార్యక్రమం ద్వారా వేలాది చెరువులను పునరుద్ధరించి గ్రామీణ ప్రాంతాల్లో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచామని ఆయన వివరించారు. చెరువుల పూడిక తొలగింపు, నీటి వనరుల అభివృద్ధి వల్ల భూగర్భ జలాలు పెరిగి రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఈ కార్యక్రమం వ్యవసాయ ఉత్పాదకతను పెంచడమే కాకుండా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసిందని చెప్పారు. మిషన్ భగీరథ పథకం తెలంగాణ ప్రజల జీవితాల్లో విప్లవాత్మక మార్పు తీసుకువచ్చిందని జగదీశ్ రెడ్డి అన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల తేడా లేకుండా ప్రతి ఇంటికీ శుద్ధమైన తాగునీటిని అందించడంలో ఈ పథకం విజయవంతమైందని తెలిపారు. దేశంలోనే ఆదర్శవంతమైన తాగునీటి సరఫరా వ్యవస్థను తెలంగాణలో ఏర్పాటు చేయడం కేసీఆర్ ప్రభుత్వ ఘనత అని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం తెలంగాణ సాగునీటి చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిందని జగదీశ్ రెడ్డి చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు రాష్ట్రంలోని అనేక ప్రాంతాలకు చేరాయని, ముఖ్యంగా సూర్యాపేట జిల్లాలో సాగునీటి లభ్యత పెరిగి వ్యవసాయం అభివృద్ధి చెందిందన్నారు. ఒకప్పుడు నీటి కొరతతో ఇబ్బందులు పడిన ప్రాంతాల్లో ప్రస్తుతం పంటలు సమృద్ధిగా పండుతున్నాయని ఆయన వెల్లడించారు. మాక్ అసెంబ్లీ వేదికగా మాట్లాడిన జగదీశ్ రెడ్డి, తెలంగాణ అభివృద్ధి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ప్రజల జీవితాల్లో శాశ్వత మార్పులు తీసుకువచ్చాయని పేర్కొన్నారు. వ్యవసాయం, తాగునీరు, సాగునీటి రంగాల్లో సాధించిన విజయాలు కేసీఆర్ నాయకత్వానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, రైతు సంక్షేమం, గ్రామీణ పురోగతి అంశాల్లో బీఆర్ఎస్ పాలనను ప్రజలు గుర్తుంచుకుంటారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# ఆదిలాబాద్ విమానాశ్రయానికి గ్రీన్ సిగ్నల్



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి)** ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతమయ్యాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్య, వ్యూహాత్మక పరంగా కీలకమైన ఈ ప్రాజెక్టు పురోగతిపై శనివారం ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో సమావేశమై చర్చించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్‌లో సంయుక్త వినియోగ విమానాశ్రయం అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ పూర్తి సమ్మతి తెలిపినట్లు కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రాజెక్టును వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి ఒక్కో నోడల్ అధికారిని వచ్చే వారంలోగా నియమించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రణాళిక, మాస్టర్ ప్లాన్ రూపకల్పనను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. గత ఏప్రిల్ 17న అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపిందని ఆయన గుర్తుచేశారు. విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన సాంకేతిక అంశాలన్నింటినీ పరిశీలించి తదుపరి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం భారత వైమానిక దళం ఆధీనంలో ఉన్న 369.45 ఎకరాల భూమికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్టు విస్తరణకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. విమానాశ్రయ ప్రాంగణంలో వైమానిక దళ శిక్షణా కేంద్రాలు, హ్యాంగర్లతో పాటు పౌర విమాన సేవలకు అవసరమైన సదుపాయాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పౌర విమానాల టెర్మినల్, నిర్వహణ కేంద్రాలు నిర్మించనున్నట్లు వెల్లడించారు. ఆదిలాబాద్ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ అభివృద్ధికి కొత్త ఊపు వస్తుందని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రవాణా, వాణిజ్యం, పరిశ్రమలు, ఉపాధి అవకాశాల పెరుగుదలకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని తెలిపారు. ప్రాంతీయ అభివృద్ధికి ఈ విమానాశ్రయం కీలక కేంద్రంగా మారనున్నట్లు పేర్కొన్నారు.

# గణేష్ నవరాత్రి ఉత్సవాలకు నిబంధనలే కవచం

- నిర్వాహకులు తప్పకుండ నియమ-నిబంధనలు పాటించాలి
- డీజేలు ప్రాణాలకు ముప్పు
- పీస్ కమిటీ సమావేశం లో పాల్గొన్న పలు శాఖల అధికారులు
- తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్



**తూప్రాన్, 12 సెప్టెంబర్ (నవజ్యోతి ప్రతినిధి నవీన్) :** మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోనీ నర్సాపూర్ చౌరస్తా వద్ద ఓ ప్రవేట్ ఫంక్షన్ హాల్ వినాయక, నవరాత్రి ఉత్సవాల పీస్ కమిటీ సమావేశనికి పలు శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ సమావేశం నిర్వహించారు, వినాయక, నవరాత్రి ఉత్సవాలను తూప్రాన్ పట్టణ ప్రజలు ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ అంతర్జాల వేదికలో మండపాల వివరాలను ఉచితంగా నమోదు చేసి, దరఖాస్తు ప్రతిని స్థానిక పోలీస్ స్టేషన్ లో అందజేయాలని



తెలిపారు.ముఖ్యంగా చందాలు భక్తితో తీసుకోవాలని కానీ భయబ్రాంతులకు గురిచేసి చందాలు వసూలు చేయవద్దని సూచించారు, ప్రజా రవాణా, అత్యవసర వాహనాలకు ఆటంకం కలగకుండా మండపాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ శాఖ అనుమతితో వైరింగ్ చేపట్టాలని సూచించారు. 24 గంటలు మండపాల వద్ద సేఫ్టీ గా టెంపరరీ సీసీ కెమెరాలు అమర్చుకోవాలి, కనీసం నలుగురు వాలంటీర్లు, అగ్నిమాపక పరికరాలు, నీటి డ్రమ్ములు, ఇసుక అందుబాటులో ఉంచాలన్నారు. డీజేలకు అనుమతి లేదని, రాత్రి 10 గంటల వరకు అనుమతితో చిన్న మైకులు మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు. మద్యం, జూదం, అసభ్యకర ప్రదర్శనలు, వివాదాస్పద ప్రసంగాలు నిషేధముని తెలిపారు. నిమజ్జన శోభాయాత్రను నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని, రెచ్చగొట్టే నినాదాలు, టపాసులు, ఇతరులకు ఇబ్బంది కలిగించే చర్యలకు పాల్పడవద్దని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే 112 కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సామాజిక మాధ్యమాల పుకార్లను నమ్మవద్దని తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బొంది రజిని, మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్, కౌన్సిలర్ లు, పలు శాఖల అధికారులు,పట్టణ ప్రజలు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మట్టితో వినాయకుడు.. పర్యావరణానికి మేలు!

## దమ్మాయిగూడలో ఎంఎంసీ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ





**దమ్మాయిగూడ, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి) :** పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే ఉద్దేశంతో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) ఆధ్వర్యంలో దమ్మాయిగూడ 4వ డివిజన్ మున్సిపల్ కార్యాలయంలో పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేశారు. జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ఐఏఎస్ సమక్షంలో, కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రామలింగం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంతోష్, మాధవాచారి తదితరుల పాల్గొనగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ముప్పా రామారావు స్థానికులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి గణేష్ చతుర్థిని పర్యావరణ బాధ్యతతో జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. మట్టి విగ్రహాల వినియోగంతో నీటి వనరుల కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుడి ఉత్సవాలకు చేయూత

## అనుశక్తినగర్, ఇందిరమ్మ కాలనీ, సైలెంట్ ఎన్‌క్లేవ్ ఉత్సవాలకు విరాళాలు

## విరాళాలు అందజేసిన దమ్మాయిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పా రామారావు



**దమ్మాయిగూడ, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి):** కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ పరిధిలో నిర్వహిస్తున్న గణేష్ చతుర్థి ఉత్సవాలకు దమ్మాయిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పా రామారావు ఆర్థిక సహాయం అందించారు. అనుశక్తినగర్ కాలనీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ ఉత్సవాలకు రూ.10,116 విరాళంగా అందజేశారు. అలాగే దమ్మాయిగూడ ఇందిరమ్మ కాలనీ నివాసితులకు గణేష్ చతుర్థి ఉత్సవాల నిర్వహణ కోసం రూ.5,116 ఆర్థిక సహాయం అందించారు. సైలెంట్ ఎన్‌క్లేవ్ కాలనీ అసోసియేషన్ సభ్యులకు కూడా ఉత్సవాల సందర్భంగా రూ.5,116 విరాళంగా అందజేశారు.

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..**

కాలనీల్లో నిర్వహించే సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఐకమత్యంతో నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా ముప్పా రామారావు ఆకాంక్షించారు. అనంతరం గణేష్ ఉత్సవాల సందర్భంగా ఆర్థిక సహాయం అందించిన దమ్మాయిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముప్పా రామారావుకు ఆయా కాలనీల ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

# గణేష్ ఉత్సవాలకు ఎల్ఈడీ లైట్ల విరాళం

## పడమటి నరసింహా రెడ్డి అభ్యర్థన మేరకు లైట్లు అందజేసిన కౌకుట్ల జీవన్‌రెడ్డి

**నాగారం, సెప్టెంబర్ 12, (నవజ్యోతి ప్రతినిధి) :** నాగారం డివిజన్ పరిధిలోని బోగారంలో గణేష్ ఉత్సవాల సందర్భంగా భక్తులు, ప్రజలకు మెరుగైన వెలుతురు సౌకర్యం కల్పించేందుకు ఎల్ఈడీ, వీధి దీపాలను కౌకుట్ల జీవన్ రెడ్డి విరాళంగా అందజేశారు. పడమటి నరసింహా రెడ్డి అభ్యర్థన మేరకు ఈ లైట్లను అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాగారం డివిజన్ అధ్యక్షుడు ఎల్లసాని భూమయ్య యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పర్వత్ రెడ్డి, బోగారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని ఎల్ఈడీ లైట్లను పంపిణీ చేశారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఎల్ఈడీ, వీధి దీపాలను అందించిన కౌకుట్ల జీవన్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా కార్యక్రమాలకు తనవంతు సహకారం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.



# మట్టి వినాయకుడు.. పర్యావరణానికి మేలు!




## తూప్రాన్ మున్సిపల్ లో మట్టి వినాయకుల పంపిణీ : కమిషనర్ రమేష్ కుమార్

**తూప్రాన్ , సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి నవీన్ ):** పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే ఉద్దేశంతో తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ బొంది రజిని, వైస్ చైర్మన్ కొక్కోండ మమత, మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్, పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు పంపిణీ చేశారు. స్థానికులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి గణేష్ చతుర్థిని పర్యావరణ బాధ్యతతో జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. మట్టి విగ్రహాల వినియోగంతో నీటి వనరుల కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# వినాయకుడి ఆకృతిలో సెరినిటీ విద్యార్థుల విన్యాసం

## వినాయక చవితి విశిష్టతను వివరించిన కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి



**నాగారం, సెప్టెంబర్ 12, (నవజ్యోతి ప్రతినిధి) :** వినాయక చవితి పండుగను పురస్కరించుకుని ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ పరిధిలోని సెరినిటీ పాఠశాలలో విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు వినాయకుడి ఆకృతిలో నిలబడి నిర్వహించిన వినూత్న విన్యాసం ఆకట్టుకుంది. విద్యార్థుల సమిష్టి ప్రదర్శనను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు అభినందించారు. ఈ సందర్భంగా సెరినిటీ పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి మాట్లాడుతూ.. వినాయక చవితి పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. వినాయకుడు జ్ఞానం, విజ్ఞానం, శుభానికి ప్రతీక అని తెలిపారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే మంచి ఆలోచనలు, క్రమశిక్షణ, సేవాభావాన్ని అలవర్చుకుని సమాజానికి ఉపయోగపడే విధంగా ఎదగాలని సూచించారు. పండుగలను కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా వాటి వెనుక ఉన్న సందేశాన్ని విద్యార్థులు తెలుసుకోవాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, వినాయక చవితి సందర్భంగా మట్టి విగ్రహాలను ప్రోత్సహించి ప్రకృతిని కాపాడాలని పిలుపునిచ్చారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ

# కృషి చేయాలి : ఉప్పల్ ఎమ్మెల్యే

## పర్యావరణహిత గణేష్ విగ్రహాల పంపిణీ



**ఉప్పల్, సెప్టెంబర్ 12, (నవజ్యోతి ప్రతినిధి) :** పర్యావరణ పరిరక్షణతో పాటు సమాజ సేవే లక్ష్యంగా లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320-హెచ్ ఆధ్వర్యంలో 'పర్యావరణహిత గణేష్ -- పచ్చని భవిష్యత్తు కోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి సైనిక్‌పురిలోని ఆయన నివాసంలో మట్టి వినాయక విగ్రహాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించని మట్టి గణేష్ విగ్రహాలను వినియోగించడం ద్వారా చెరువులు, నీటి వనరులను పరిరక్షించవచ్చని తెలిపారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు లయన్స్ ఇంటర్నేషనల్ చేపడుతున్న కార్యక్రమం అభినందనీయమన్నారు. 'ప్రకృతిని కాపాడుతూ బప్పాను స్వాగతిద్దాం.. పచ్చని భవిష్యత్తుకు చిన్న అడుగు వేద్దాం' అనే సందేశంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ప్రజలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమ సలహాదారుగా కుశాయిగూడ లయన్స్ ట్రస్ట్ ఆసుపత్రి చైర్మన్ లయన్ కొత్త రామారావు, ఎంయూజేఎఫ్, కార్యక్రమ సమన్వయకర్తగా లయన్ కొత్తపల్లి రాంబాబు, పీఎంజేఎఫ్, లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320-హెచ్ జిల్లా కార్యదర్శి - గ్లోబల్ కాజెస్ వ్యవహరించారు. కార్యక్రమంలో కాసం మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ లో 32 కుటుంబాలకు

# సీఎం రిలీఫ్ ఫండ్ భరోసా

## రూ.18.64 లక్షల విలువైన చెక్కుల పంపిణీ..

## లబ్ధిదారులకు అందజేసిన మందుముల పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్, సెప్టెంబర్ 12, (నవజ్యోతి ప్రతినిధి):** అనారోగ్యంతో వైద్యం చేయించుకుంటూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోందని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆయన చొరవతో నియోజకవర్గంలోని వివిధ డివిజన్లకు చెందిన 32 కుటుంబాలకు మొత్తం రూ.18,64,400 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు విడుదలయ్యాయి. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పరమేశ్వర్‌రెడ్డి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యం చేయించుకోలేని కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసా కల్పిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తామని పేర్కొన్నారు. కష్టకాలంలో తమకు ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, తమ సమస్యలకు అండగా నిలిచిన మందుముల పరమేశ్వర్‌రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## భిక్కనూరులో ఉచిత మట్టి వినాయకుల పంపిణీ



భిక్కనూర్, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి): భారతీ ఫౌండేషన్ చైర్మన్, డీసీసీ కార్యదర్శి లింగాల రాజబాబు గౌడ్ ఆధ్వర్యంలో భిక్కనూర్ గాంధీచౌక్‌లో ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఇలియాస్ ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ రేఖ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుదర్శన్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీరామ్ వెంకటేష్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మంటల్లో ఇల్లు.. కష్టాల్లో కుటుంబం.. బీజేపీ భరోసా



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి): గాజులరామారం డివిజన్ పరిధిలోని రావి నారాయణరెడ్డి నగర్‌లో అగ్ని ప్రమాదానికి గురైన రెడ్డి ల్యాబ్ శ్రీనివాస్ నివాసాన్ని బీజేపీ నాయకులు సందర్శించారు. ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యం కల్పించారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో–కన్వీనర్, గాజులరామారం డివిజన్ మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి తనయుడు రావుల రిషీంద్రసాగర్‌తో పాటు బీజేవైఎం నాయకులు భరత్‌కుమార్, కొణతం రమేష్, మంజునాథ్, రామారావు తదితరులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అగ్ని ప్రమాదంలో రూ.7 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేశారు. బాధిత కుటుంబానికి తమవంతు సహకారం అందించడంతో పాటు కష్టకాలంలో అండగా ఉంటామని బీజేపీ నాయకులు భరోసా ఇచ్చారు.

## తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి



గజ్వేల్, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ గజ్వేల్ మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర పార్టీ పిలుపు, జిల్లా పార్టీ ఆదేశాల మేరకు శుక్రవారం గజ్వేల్ తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ రాజుకు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్‌గౌడ్ మాట్లాడుతూ గతంలో టీఆర్ఎస్ ప్రభుత్వం సమైక్య దినోత్సవం పేరుతో తెలంగాణ ప్రజల ఆకాంక్షలను విస్మరించిందని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజాపాలన పేరుతో కాలయాపన చేస్తోందని విమర్శించారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని బీజేపీ డిమాండ్ చేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎల్కంటి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు వంజరీ రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మన్నే శేఖర్, దాతర్‌పల్లి సర్పంచ్ దివ్యరాజు, మండల ప్రధాన కార్యదర్శి ఇప్ప స్వామి, ఉపాధ్యక్షులు కూర స్వామి, శాతం స్వామి, నరసింహారెడ్డి, సోషల్ మీడియా అసెంబ్లీ కన్వీనర్ ఆనంద్‌సాయి, సీనియర్ నాయకుడు బోయిని సత్యం తదితరులు పాల్గొన్నారు.

## కుక్కలు బాబోయ్.. కుక్కలు!



గజ్వేల్, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి): గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల బెడదతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గుంపులు గుంపులుగా సంచరిస్తున్న కుక్కలతో పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, మహిళలు, వృద్ధులు రోడ్లపై ఒంటరిగా వెళ్లేందుకు భయపడుతున్నారు. ఇప్పటికే పలువురు పాదచారులు, ద్విచక్ర వాహనదారులపై కుక్కలు దాడి చేసిన ఘటనలు చోటుచేసుకున్నాయని స్థానికులు తెలిపారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత తీవ్రంగా మారుతోందని, ప్రధాన కూడళ్లు, అంతర్గత రహదారుల్లో కుక్కల సంచారం పెరిగిపోయిందని వాపోయారు. వీధి కుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించేందుకు మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# తెల్లాపూర్ రైల్వే అండర్ బ్రిడ్జ్‌కు రూ.21 కోట్లు

- 25 ఏళ్ల సమస్యకు పరిష్కారం దిశగా అడుగులు







రామచంద్రపురం, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి): పటాన్‌చెరు నియోజకవర్గం తెల్లాపూర్ డివిజన్ పరిధిలో తెల్లాపూర్ నుంచి విద్యుత్‌న గర్‌కు వెళ్లే మార్గంలోని రైల్వే అండర్ బ్రిడ్జ్ విస్తరణ పనులకు అడుగులు పడ్డాయి. అండర్ బ్రిడ్జ్ చిన్నగా ఉండటంతో గత 25 ఏళ్లుగా ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను ఎంపీ రఘునందన్‌రావు కేంద్ర రైల్వే శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో అండర్ బ్రిడ్జ్ అభివృద్ధి పనులకు రూ.21 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం రైల్వే, జీహెచ్ఎంసీ అధికారులు అండర్ బ్రిడ్జ్ పరిసరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇరువైపులా ఉన్న కాలనీల ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, రాకపోకలకు అంతరాయం లేకుండా పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. స్థానికుల సమస్యలను పరిగణనలోకి తీసుకుని పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు.

## కారు తుడిపించిన వీడియో వైరల్...

### పంచాయతీ సిబ్బంది ఫిర్యాదు

బిక్కనూరు, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి):బిక్కనూరు గ్రామపంచాయతీలో పనిచేస్తున్న సిబ్బంది స్వామితో తన సొంత వాహనాన్ని శుభ్రం చేయించారంటూ వీడియో తీసి పత్రిక, యూట్యూబ్ ఛానల్‌లో ప్రచారం చేశారని ఆరోపిస్తూ గ్రామపంచాయతీ సిబ్బంది పోలీసులను ఆశ్రయించాడు. తనకు సంబంధం లేని విషయాన్ని తనపై మోపి వీడియోలు తీసి ప్రచారం చేయడం వల్ల ఇబ్బందులకు గురయ్యానని ఫిర్యాదులో పేర్కొన్నాడు.స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. తాను యథావిధిగా విధులు నిర్వహించిన అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో విశ్రాంతి తీసుకుంటుండగా విలేకరి గంగల రవి అక్కడికి వచ్చి 'ఇలా విశ్రాంతి తీసుకుంటే ఎలా' అని ప్రశ్నించాడని తెలిపాడు. తన విధులు పూర్తయ్యాయని చెప్పగా, గ్రామపంచాయతీ అధికారి వాహనం దుమ్ముగా ఉందని, కనీసం కారును శుభ్రం చేయలేరా అని ప్రశ్నించడంతో తాను వాహనాన్ని శుభ్రం చేశానని పేర్కొన్నాడు.ఈ సమయంలో గంగల రవి సమక్షంలో తాను కారు



శుభ్రం చేస్తున్న దృశ్యాలను చిత్రీకరించి అనంతరం వాటిని పత్రిక, యూట్యూబ్ ఛానల్‌లో ప్రచారం చేశారని ఆరోపించాడు. విషయం తెలుసుకున్న ఈవో మహేష్ గౌడ్ తన అనుమతి లేకుండా వాహనాన్ని ఎందుకు శుభ్రం చేశావని ప్రశ్నించారని, గంగల రవి చెప్పడంతోనే తాను కారు శుభ్రం చేశానని స్వామి చెప్పినట్లు పేర్కొన్నాడు.తన ఆదేశాలు లేకుండా పని చేసినందుకు విధులకు రావద్దని ఈవో మహేష్ గౌడ్ చెప్పారని స్వామి తెలిపాడు. గ్రామపంచాయతీలో పనిచేయడమే తన కుటుంబానికి జీవనాధారమని, విధులకు దూరం కావడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశాడు. తనను ఈ పరిస్థితికి గురిచేసిన ఘటనపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించాడు.కారు తుడిపించిన అంశాన్ని వక్రీకరించి తనపై తప్పుడు ప్రచారం చేశారని, దాని కారణంగా తాను ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని స్వామి ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టాల్సి ఉంది.

## చెత్త సేకరణ కాంట్రాక్టు వద్దు.. మా ఉపాధి మాకు ముద్దు!

రాంకీకి అప్పగించొద్దంటూ స్వచ్ఛ ఆటో కార్మికుల ఆందోళన



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి): చెత్త సేకరణ బాధ్యతలను ప్రైవేటు సంస్థకు అప్పగించి తమ ఉపాధికి గండికొట్టొద్దని స్వచ్ఛ ఆటో కార్మికులు డిమాండ్ చేశారు. జగద్గిరిగుట్ట డంపింగ్ యార్డు ఎదుట స్వచ్ఛ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టి, ఇంటింటికీ తిరిగి చెత్త సేకరిస్తూ జీవనం సాగిస్తున్న తమకు ప్రత్యామ్నాయం చూపకుండా రాంకీ సంస్థకు కాంట్రాక్టు అప్పగించవద్దని కోరారు. కొత్తగా ప్రవేశపెడుతున్న విద్యుత్ చెత్త సేకరణ వాహనాలను ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికులకే ప్రాధాన్యతతో కేటాయించాలని, వాహనాలు లేని వారికి కూడా వాహనాలు అందించి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. గతంలో అమలు చేసిన వాహన యాజమాన్య పథకాన్ని కొనసాగించాలని, చెత్త సేకరణ వినియోగ రుసుములను అధికారికంగా ప్రకటించి కార్మికులే నేరుగా వసూలు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. స్థానికులకు ఉపాధిలో ప్రాధాన్యతతో పాటు కార్మికుల కుటుంబాలకు ఆరోగ్య బీమా, సామాజిక భద్రత, పని ప్రదేశాల్లో భద్రతా పరికరాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నిరసన చేస్తున్న కార్మికులను పోలీసులు అడ్డుకుని జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర స్వచ్ఛ ఆటో టిప్పర్ చైర్మన్ ఎత్తరి గోపి, సీఎంసీ చైర్మన్ మిట్ట సత్యరెడ్డి, సలహాదారు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



## అయ్యప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఘనంగా ముగిసిన శ్రావణమాసం పూజలు



గజ్వేల్, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి): గజ్వేల్‌లోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రావణమాసం చివరి శనివారం సందర్భంగా స్వామివారికి విశేష పూజలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. కౌన్సిలర్ మామిడి శ్రీధర్–విద్యాధరి దంపతులు, మాజీ కౌన్సిలర్ శిరీష–రాజు దంపతులు, తాటిపల్లి భాగ్యలక్ష్మి కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవభక్తి, సేవా గుణాన్ని కలిగి ఉండాలని, అయ్యప్ప స్వామి అనుగ్రహం అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బొగ్గుల సురేష్ గురుస్వామి, ప్రధాన కార్యదర్శి అయిత సత్యనారాయణ మాట్లాడుతూ నెల రోజుల పాటు దంపతుల ఆధ్వర్యంలో శ్రావణమాసం పూజలు నిర్వహించామని తెలిపారు. వినాయక చవితి సందర్భంగా నవరాత్రులు పంచామృత అభిషేకాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా చేపట్టాలి

బూర్గుల్, గున్కుల్ గ్రామాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ విక్టర్

జుక్కల్, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి): మహమ్మద్‌నగర్ మండలంలోని బూర్గుల్, గున్కుల్ గ్రామాల్లో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జుక్కల్ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ ) వి.విక్టర్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 238, 241 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని పరిశీలించి, తహసీల్దార్ లతతో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు. గున్కుల్‌లో ఓటర్లు సమర్పించిన పత్రాలు, వివరాల నమోదు, దరఖాస్తుల స్వీకరణ, పత్రాల పరిశీలన తీరును అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, వివరాల నమోదులో పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం బూర్గుల్‌లోని టీకాల కేంద్రాన్ని సందర్శించి సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లత, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు గంగి రమేష్‌యాదవ్, సర్పంచ్ గజ్జల జీవన్, పంచాయతీ కార్యదర్శి అంజయ్య, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# టోల్‌గేట్ వద్ద ట్రాఫిక్ నరకం!

## వినాయక చవితి రద్దీకి తోడు నిర్మాణ పనులు.. వాహనాల తనిఖీలతో మరింత ఇక్కట్లు





బిక్కనూర్, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి):వినాయక చవితి సందర్భంగా హైదరాబాద్ నుంచి స్వగ్రామాలకు బయలుదేరిన వాహనాలతో భిక్కనూరు టోల్‌గేట్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సుమారు 500 మీటర్ల మేర వాహనాలు బారులు తీరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. టోల్‌గేట్ పరిసరాల్లో కొనసాగుతున్న నిర్మాణ పనులతో రహదారి ఇరుకుగా మారడం, పండుగ సందర్భంగా ఒక్కసారిగా వాహనాల రద్దీ పెరగడం సమస్యకు ప్రధాన కారణంగా మారింది.

**సమయం.. స్థలం కూడా ముఖ్యం**

పండుగల సమయంలో భారీగా వాహనాల రాకపోకలు ఉంటాయని ముందుగానే తెలిసినప్పటికీ టోల్‌గేట్ వద్ద ప్రత్యేక ట్రాఫిక్ నిర్వహణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు రద్దీ రోజుల్లో అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి వాహనాలను క్రమబద్ధీకరించడంతో పాటు తనిఖీలను ప్రత్యామ్నాయ ప్రాంతానికి తరలించాలని ప్రయాణికులు కోరుతున్నారు.తనిఖీలు ఆపాలని కాదు.. ట్రాఫిక్ రద్దీని మరింత పెంచకుండా తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల భద్రత ఎంత ముఖ్యమో.. వారి సజావు ప్రయాణం కూడా అంతే ముఖ్యమని అధికారులు గుర్తించాల్సిన అవసరం ఉంది.

### ట్రాఫిక్ క్లియర్ చేయాల్సిన చోటే తనిఖీలు

ఇప్పటికే వాహనాలు నెమ్మదిగా కదులుతున్న సమయంలో టోల్‌గేట్ సమీపంలో పోలీసులు వాహనాలను ఆపి తనిఖీలు నిర్వహించడం ప్రయాణికుల్లో అసంతృప్తికి కారణమవుతోంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన సమయంలో తనిఖీల కోసం వాహనాలను ఆపడంతో రద్దీ మరింత పెరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాహనాల తనిఖీలు అవసరమే. అయితే భారీగా రద్దీ ఉన్న టోల్‌గేట్ వద్ద కాకుండా, వాహనాలను సురక్షితంగా పక్కకు నిలిపే అవకాశం ఉన్న ముందస్తు ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తే ప్రధాన రహదారిపై రాకపోకలకు అంతరాయం తగ్గుతుందని వాహనదారులు సూచిస్తున్నారు.

## రామాయంపేట మండలంలో పోలింగ్ కేంద్రాల తనిఖీ

**నో మ్యాపింగ్, లాజికల్ డిస్క్రెపెన్సీ కేసుల పరిష్కారానికి ఆదేశాలు**





రామాయంపేట, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్): ఓటర్ల జాబితా పరిశీలనలో భాగంగా మెదక్ ఆర్డీవో రామదేవి, తహసీల్దార్ రజినీకుమారి శనివారం రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని 80, 81, 84, 85, 87, 89 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఓటర్ల జాబితా సవరణ, ఫారం–6, 7, 8 దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, నమోదును పరిశీలించారు. నో మ్యాపింగ్, లాజికల్ డిస్క్రెపెన్సీ కేసుల వివరాలను పరిశీలించి, పెండింగ్ కేసులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కోనాపూర్ గ్రామంలోని 92, 93 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి, పెండింగ్ కేసులపై రోజువారీ విచారణ చేపట్టి పరిష్కరించాలని సూచించారు. బీఎల్ఓ యాప్‌లో ఫారం–6, 7, 8 దరఖాస్తుల నమోదును పరిశీలించి, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాలను నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

## మురుగు రోడ్డుపై.. బాధ్యత ఎవరిది?

**నెల రోజులుగా డ్రైనేజీ లీకేజీతో ప్రజలకు ఇబ్బందులు**



కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి): జీడిమెట్ల మీనాక్షి కాలనీ అంగడిపేట రోడ్డులో వైన్ షాప్ సమీపంలో డ్రైనేజీ లీకేజీతో నెల రోజులుగా మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు నీటితో దుర్వాసన, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను 132వ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే పరిశీలించి సంబంధిత జలమండలి అధికారులకు ఫిర్యాదు చేశారు. డ్రైనేజీ లీకేజీని తక్షణమే మరమ్మతు చేసి, సమస్య పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. నెల రోజులుగా సమస్య కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న స్థానికులు, ఇప్పటికైనా జలమండలి అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## తప్పుల్లేని ఓటర్ల జాబితా తయారీకి కృషి చేయాలి : తహసీల్దార్ మంగ



నడిగూడెం, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పారదర్శకమైన, తప్పుల్లేని ఓటర్ల జాబితా రూపొందించేందుకు బూత్ స్థాయి అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని తహసీల్దార్ మంగ సూచించారు. ప్రత్యేక ప్రచార దినోత్సవం సందర్భంగా మండలంలోని 286, 287, 288, 289, బృందావనపురంలోని 274, 275 పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పురోగతిపై బీఎల్ఓలతో సమీక్షించారు. నో మ్యాపింగ్, సాంకేతిక లోపాలు ఉన్న ఓటర్లను గుర్తించి నోటీసులు జారీ చేయాలని, సరైన ధ్రువీకరణ పత్రాలను సేకరించి సకాలంలో నమోదు చేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడంతో పాటు మరణించినవారి పేర్లు, ఒకటికి మించి చోట్ల నమోదైన ఓట్లను నిబంధనల ప్రకారం తొలగించాలని సూచించారు. ఓటర్లు తమ వివరాలను పరిశీలించుకుని తప్పులు ఉంటే బీఎల్ఓలను సంప్రదించి అవసరమైన పత్రాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, బీఎల్ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుల రాకపోకలకు అండర్‌పాస్ నిర్మించాలి

**601, 602 బ్రిడ్జిల మధ్య రైల్వే అండర్‌పాస్ మంజూరు చేయాలని వినతి**



రామాయంపేట, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్): అక్కన్నపేట గ్రామ రైతుల వ్యవసాయ అవసరాల కోసం రైల్వే అండర్‌పాస్ నిర్మించాలని కోరుతూ సర్పంచ్ బక్కయ్యగారి యాదగిరి ఆధ్వర్యంలో రైతులు దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. అక్కన్నపేట–మెదక్ కొత్త రైల్వే లైన్ నిర్మాణంతో సుమారు 200 మంది రైతులు వ్యవసాయ భూములకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రధాన దారి మూసుకుపోవడంతో ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, బోరు బండ్లు వంటి వ్యవసాయ వాహనాలను పొలాలకు తీసుకెళ్లడం కష్టంగా మారిందన్నారు. రైల్వే బ్రిడ్జి నంబర్లు 601, 602 మధ్య అండర్‌పాస్ నిర్మిస్తే రైతుల రాకపోకలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. గతంలో రైల్వే అధికారులు స్థలాన్ని పరిశీలించి అండర్‌పాస్ నిర్మిస్తామని చెప్పినా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని 601, 602 బ్రిడ్జిల మధ్య అండర్‌పాస్‌ను మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.

## సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగించాలి

**నడిగూడెంలో ఘనంగా ద్వితీయ వర్ధంతి కార్యక్రమం**



నడిగూడెం, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్): సీపీఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని నడిగూడెం మండల కేంద్రంలో శనివారం ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వామపక్ష భావజాలాన్ని బలంగా వినిపిస్తూ పేదలు, కార్మికులు, రైతులు, సామాన్య ప్రజల హక్కుల కోసం ఏచూరి చేసిన పోరాటాలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయాలు, సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ఐక్య పోరాటాలను బలోపేతం చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బెల్లకొండ సత్యనారాయణ, బీరవల్లి సుధాకర్‌రెడ్డి, లతీఫ్‌బాబు, పిచ్చయ్య, రేంటాల శ్రీను, బొడ్డు బాలకృష్ణ, కందుల సంజీవరావు, మీట్టకడుపుల శ్రీను, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## మట్టితో గణనాథుడు.. పర్యావరణానికి రక్షణ!

**ఐదు వేల మట్టి వినాయక విగ్రహాల పంపిణీ**





కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి): వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేలా కొంపల్లి సర్కిల్ పరిధిలో యునైటెడ్ హెల్పింగ్ హ్యాండ్స్ 369 ఆధ్వర్యంలో 5 వేల మట్టి వినాయక విగ్రహాలను చిన్నారులు, పాఠశాల విద్యార్థులు, స్థానికులకు ఉచితంగా పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు ఎస్.ఎల్. రాజేష్, డైరెక్టర్ సునీత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అల్వాల్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ భోగేశ్వరరావు, మహేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భోగేశ్వరరావు మాట్లాడుతూ

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా సహజసిద్ధమైన మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. భక్తి పేరుతో పర్యావరణానికి నష్టం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. చిన్నారుల్లో పర్యావరణ స్పృహ పెంపొందించేలా 'గ్రీన్ గణేష్–పర్యావరణహిత వినాయక చవితి' సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఐదు వేల మట్టి విగ్రహాల పంపిణీ చేపట్టిన నిర్వాహకులను అభినందించారు.

## విశ్రాంత ప్రధానోపాధ్యాయులు మండవ వెంకటేశ్వరరావుకు ఘన సన్మానం



నడిగూడెం, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి షేక్ నజీరుద్దీన్): విశ్రాంత ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం పనిచేస్తోందని సంఘం జిల్లా జాయింట్ సెక్రెటరీ గుండు అనంతరాములు అన్నారు. నడిగూడెం మండల శాఖ ఆధ్వర్యంలో రిటైర్డ్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండవ వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలను శనివారం ఆయన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావును శాలువాతో సత్కరించి, స్వీట్లు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని అనంతరాములు ఆకాంక్షించారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి సంఘం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల శాఖ కార్యదర్శి లావూరి బాలాజీ నాయక్, ఆర్థిక కార్యదర్శి ఎండీ ఇబ్రహీం, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## మేడ్చల్ మండలంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**రాకేష్‌కుమార్‌కు 'బెస్ట్ టీచర్' అవార్డు**



మేడ్చల్, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి): మేడ్చల్ మండల ప్రైవేట్ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మేడ్చల్‌లోని హైటెక్ వాల్యూ రెసిడెన్షియల్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో శ్రీ వివేకానంద హైస్కూల్ ఉపాధ్యాయుడు దుందిగళ్ల రాకేష్‌కుమార్‌కు 'బెస్ట్ టీచర్' పురస్కారం అందజేశారు. మండల విద్యాశాఖాధికారి వై. శంకరయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర సంఘం అధ్యక్షుడు డాక్టర్ బి. శ్రీధర్, ఎన్.ఎల్.కె. రామేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు.

## కూకట్‌పల్లి కోర్టులో జాతీయ లోక్ అదాలత్




కూకట్‌పల్లి, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి): సుదీర్ఘ న్యాయపోరాటాలకు స్వస్తి పలికి, చిన్నచిన్న వివాదాలను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవడం శ్రేయస్కరమని న్యాయమూర్తులు సూచించారు. హైకోర్టు ఆదేశాల మేరకు కూకట్‌పల్లి కోర్టులో శనివారం మూడో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. రాజీకి అవకాశం ఉన్న పెండింగ్ కేసులను ఉభయపక్షాల సమ్మతితో సత్వరమే పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ వేదికగా ఉపయోగపడుతుందని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజిగిరి 3వ అదనపు జిల్లా జడ్జి ఎం. వెంకటేశ్వర్‌రావు, 6వ అదనపు జిల్లా జడ్జి డి. రాంప్రసాద్‌రావు, సీనియర్ సివిల్ జడ్జిలు ఎం. సంధ్యారాణి, జె. శ్యాంకుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, కార్యదర్శి సురేందర్‌గౌడ్, న్యాయవాదులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణహితంగా వినాయక చవితి జరుపుకోవాలి

**వినాయక షెడ్ నిర్మాణానికి కృషి చేసిన సింధు ఆదర్శ్‌రెడ్డికి సన్మానం**



రామచంద్రపురం, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి): వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో పాటు పర్యావరణ హితంగా జరుపుకోవాలని భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ వి.సింధు ఆదర్శ్‌రెడ్డి ప్రజలకు సూచించారు. వినాయక చవితిని పురస్కరించుకుని భారతీనగర్ డివిజన్‌లోని ఎల్ఐజీ వార్డు కార్యాలయంలో నిర్వహించిన ఉచిత వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని భక్తులకు విగ్రహాలను అందజేశారు. ప్రతి కుటుంబం ఆనందంగా పండుగ జరుపుకోవాలనే ఉద్దేశంతో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆమె కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో మంజూరు చేయించి నిర్మించిన వినాయక షెడ్‌ను సందర్శించారు. షెడ్ నిర్మాణానికి కృషి చేసిన సింధు ఆదర్శ్‌రెడ్డిని కాలనీ ప్రజలు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

## తాగునీరు లేక ప్రజల ఇబ్బందులు.. మరోవైపు నీటి వృథా!

**అధికారుల నిర్లక్ష్యమా..? కాలనీవాసుల లోపమా..?**



రామచంద్రపురం, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి): రామచంద్రపురం మండలం తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కేసీఆర్ నగర్ ఫేజ్–2లో వింత పరిస్థితి నెలకొంది. ఒకవైపు తాగునీటి కోసం కాలనీవాసులు ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు 4వ సెక్టార్ మైదానంలోని సంపు వద్ద గంటల తరబడి నీరు వృథాగా పోతున్న ఘటనపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విలువైన తాగునీరు వృథా అవుతున్నా సంబంధిత సిబ్బంది పట్టించుకోకపోవడంపై అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే నీటి సరఫరాలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు నీరు అందకపోవడంతో పాటు, అందుబాటులో ఉన్న నీరు వృథా కావడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు అధికారులు వెంటనే స్పందించి నీటి వృథాకు కారణాలను గుర్తించి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్తులో నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

## కిష్టాపూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం..

**మద్యం మత్తులో కారు బీభత్సం!**




మేడ్చల్ జిల్లా కిష్టాపూర్ గ్రామంలో ఒక ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రావల్కోల్ చౌరస్తా నుండి మేడ్చల్ వైపు వెళ్తున్న బ్రెజా కారు నడుపుతున్న వ్యక్తి హీరా సింగ్ (46) (నెంబర్: TG 08 N 8752), కిష్టాపూర్‌లోని ఎల్లమ్మ గుడి సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్ మరియు షిఫ్ట్ డిజైర్ కారుని ఆగి ఉన్న అశోక్ లేలాండ్ వాహనాన్ని ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో అటుగా వస్తున్న బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ పూర్తిగా మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు తెలిపారు.ఘటన స్థలానికి చేరుకున్న స్థానికులు వెంటనే అప్రమత్తమై, కారు నడుపుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి, 108 వాహనం ద్వారా గాయపడ్డ క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# తండ్రి ఆశయాలతో.. పేదలకు వైద్య సేవలు

**అన్ని రక్త పరీక్షలపై 50 శాతం వరకు తగ్గింపు: డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్**



వెల్దుర్తి, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి ముకుంద్): గ్రామీణ పేద, మధ్యతరగతి ప్రజలకు అందుబాటు ధరల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని శ్రీ వెంకటేశ్వర నర్సింగ్ హోమ్ వైద్యుడు డాక్టర్ సిహెచ్.శ్రీనివాస్ తెలిపారు. శనివారం వెల్దుర్తి పట్టణంలో నిర్వహించిన ఆరోగ్య అవగాహన నడక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వ్యాధులు రాకముందే జాగ్రత్తలు తీసుకోవడం, సకాలంలో వైద్యులను సంప్రదించేలా ప్రజల్లో అవగాహన కల్పించడమే కార్యక్రమ ఉద్దేశమన్నారు. తన తండ్రి డాక్టర్ పెద్ద నర్సింలు మూడు దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంత పేదలకు వైద్య సేవలు అందించారని, ఆయన ఆశయాలను కొనసాగిస్తూ వెల్దుర్తిలోనే మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. 24 గంటల వైద్య సేవలు, సాధారణ వైద్యం, జ్వరాలు, మధుమేహం, రక్తపోటు, తల్లి–బిడ్డల వైద్యం, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డెంగ్యూ, హెచ్‌బీ, థైరాయిడ్, టైఫాయిడ్, మలేరియా, మూత్రపిండాలు, కాలేయానికి సంబంధించిన రక్త పరీక్షలను 50 శాతం వరకు తగ్గింపు ధరల్లో అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ దండెం ఆదర్శ్, ఉపసర్పంచ్ కమ్మరి శ్రావణ్‌కుమార్, బీజేపీ జిల్లా నాయకుడు అంగడిపేట శ్రీనివాస్‌గౌడ్, వార్డు సభ్యుడు శాకారం శ్రీనివాస్‌గౌడ్, వైద్యులు, నర్సింగ్ హోమ్ సిబ్బంది, ఆరోగ్య అవగాహన బృందం సభ్యులు పాల్గొన్నారు.

## దళితులపై బీఆర్ఎస్ గుండాయిజం అంటూ కాంగ్రెస్ రాస్తారోకో




హత్నూర, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి): అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ హత్నూర మండలం దౌల్తాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రే కృష్ణ ముదిరాజ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఆయనను వెంటనే ఎమ్మెల్సీ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద దళిత సంఘాల నాయకులను అవమానించారని ఆరోపిస్తూ, బీఆర్ఎస్ దళిత వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి హకీమ్, పలువురు సర్పంచులు, యూత్ కాంగ్రెస్ నాయకులు చార్ల సందీప్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫుట్‌పాత్ ఆక్రమిస్తే కేసులు నమోదు



తూప్రాన్, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి నవీన్): తూప్రాన్ పట్టణంలో ఫుట్‌పాత్, జాతీయ రహదారిని ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై మున్సిపల్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తే ఇకపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రమేష్‌కుమార్ హెచ్చరించారు. జాతీయ రహదారిపై ఆక్రమణలతో వాహనాల రాకపోకలకు, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ గంగరాజు తెలిపారు. దుకాణాల ముందు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించకుండా నిబంధనలు పాటించాలని సూచించారు. అధికారులు ఇకనైనా ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది మధు తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డిలో కాంగ్రెస్ వార్డు కమిటీల నియామకం



కామారెడ్డి, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి): కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే లక్ష్యంతో 5, 29, 30వ వార్డులకు నూతన కాంగ్రెస్ పార్టీ కమిటీలను నియమించారు. హసన్ ఫంక్షన్ హాల్‌లో పట్టణ అధ్యక్షుడు ఐరేని సందీప్, గూడెం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వార్డు నాయకులతో సమావేశం నిర్వహించి కమిటీలను ఎన్నుకున్నారు. ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ఫోన్ ద్వారా సందేశమిస్తూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు మహమ్మద్ ఇలియాస్ మాట్లాడుతూ ప్రతి వార్డులో ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా పనిచేయాలని సూచించారు. నూతన కమిటీ సభ్యులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు పండ్ల రాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు భూమని బాలరాజ్, రాజాగౌడ్, నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్టీఐ సమాచారానికి అధికారుల 'మరో పది రోజులు'!

**మూడు నెలలైనా 18 గ్రామపంచాయతీల నిధుల లెక్కలు బయటకు రాలేదా?**



భిక్కనూర్, సెప్టెంబర్ 12 (మనం న్యూస్): సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసి మూడు నెలలు గడిచినా 18 గ్రామపంచాయతీలకు సంబంధించిన ఆరు సంవత్సరాల ఈ–పంచాయతీ నిర్వహణ నిధుల వివరాలు అందకపోవడంపై దరఖాస్తుదారు అసంతృప్తి వ్యక్తం చేశారు. 2020 నుంచి 2026 వరకు గ్రామపంచాయతీలకు వచ్చిన నిర్వహణ నిధులు, ఏ ఏడాది ఎంత మొత్తం జమ అయిందనే వివరాలను కోరినట్లు తెలిపారు. అయితే ఇప్పటివరకు పూర్తి సమాచారం ఇవ్వకపోగా, మరో పది రోజుల సమయం కావాలని అధికారులు కోరినట్లు వెల్లడించారు. ప్రభుత్వ పథకాల పనుల్లో అధికారులు బిజీగా ఉన్నందున సమాచారం సేకరించేందుకు అదనపు సమయం అవసరమని మండల అభివృద్ధి అధికారి పేర్కొన్నట్లు దరఖాస్తుదారు తెలిపారు. గతంలో ఎంపీడీవో కార్యాలయ రికార్డుల పరిశీలనలో కొన్ని చెక్కుల బిల్లులు అందుబాటులో లేవని సిబ్బంది రాతపూర్వకంగా తెలిపిన నేపథ్యంలో, తాజాగా నిధుల వివరాల కోసం కూడా జాప్యం జరుగుతుండటంపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. ప్రజల సొమ్ముకు సంబంధించిన నిధుల లెక్కలను పారదర్శకంగా వెల్లడించాలని, అదనపు గడువులోనైనా పూర్తి సమాచారం అందించాలని కోరారు.

## బిక్కనూరు పీహెచ్‌సీ వద్ద మందులు పారవేస్తున్న వారిని పట్టుకున్న సిబ్బంది

**పోలీసులకు అప్పగింత.. గత ఘటనతో సంబంధంపై ఆరా**



బిక్కనూరు, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి): బిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాల్లో మందులు పారవేస్తున్నట్లు గుర్తించిన కొందరిని ఆసుపత్రి సిబ్బంది శనివారం పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గత కొన్ని రోజులుగా ఇదే తరహాలో మందులు పడేస్తున్నట్లు గుర్తించిన సిబ్బంది నిఘా ఉంచి వారిని పట్టుకున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీ ఫార్మసిస్ట్ స్వామి, హెల్త్ అసిస్టెంట్ సతీష్, అటెండర్లు శ్రావణ్, అబేదలి, భాస్కర్ ఈ చర్యలో కీలకంగా వ్యవహరించారు. పట్టుబడిన వారిని బిక్కనూరు పోలీస్ స్టేషన్‌కు తరలించి అప్పగించారు. ఇటీవల సిద్ధరామేశ్వర నగర్ సమీపంలోని 44వ జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ ఆసుపత్రులకు సంబంధించిన మందుల కార్టన్లు లభించిన నేపథ్యంలో తాజా ఘటనపై ఆసక్తి నెలకొంది. ఈ విషయాన్ని పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ యమీమా జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ జి.వెంకట్ దృష్టికి తీసుకెళ్లారు. మందులను ఎవరు అందించారు, ఎందుకు పారవేస్తున్నారనే విషయాలపై పోలీసులు విచారణ చేపట్టనున్నారు.

## అన్ని దానాల కన్నా రక్తదానం గొప్పది

**పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ**




శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి): అన్ని దానాల్లో రక్తదానం ఎంతో గొప్పదని, రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం లభిస్తుందని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీలో హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ జన్మదినం సందర్భంగా నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొన్నారు. కొండా విజయ్‌కుమార్‌ను శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో కొండా విజయ్‌కుమార్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. శిబిరంలో సుమారు 115 మంది రక్తదానం చేయడం అభినందనీయమని తెలిపారు. తలసేమియా బాధితులు, గర్భిణులు, ప్రమాదాల్లో గాయపడిన వారికి తరచూ రక్తం అవసరమవుతుందని, ప్రతి ఒక్కరూ రక్తదానంపై ఉన్న అపోహలను వీడి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు హమీద్ పటేల్, ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# రామాయంపేటలో బీజేపీ నేతల ముందస్తు అరెస్టులు

**ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల కోసం 'చలో అసెంబ్లీ'**



రామాయంపేట, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్): ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ చేపట్టిన 'చలో అసెంబ్లీ–ముట్టడి' కార్యక్రమం నేపథ్యంలో రామాయంపేటలో పోలీసులు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు శీలం అవినాష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అక్కల అనిల్, నాయకులు సంతోష్, బీజేవైఎం నాయకులు నాగరాజు, దుబ్బెనపల్లి సందీప్ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చలో అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా అరెస్టులు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

## ఓట్ల తొలగింపుపై జోనల్ కార్యాలయం ముట్టడిస్తాం

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి): అర్హులైన వారి ఓట్లను వెంటనే నమోదు చేయకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి జోనల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హెచ్చరించారు. నియోజకవర్గంలో ఎస్ఐఆర్ పేరుతో కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. 4.90 లక్షల ఓటర్లున్న కూకట్‌పల్లిలో 63 వేల మందిని మాత్రమే నిర్ధారించి, 2.50 లక్షల మందికి నోటీసులు ఇచ్చారని, 1.50 లక్షల ఓట్లను అక్రమంగా తొలగించారని ఆరోపించారు. తొలగించిన ఓట్లను పునరుద్ధరించేందుకు వచ్చే ప్రజలను అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. రెండు నెలలు గడుస్తున్నా దాదాపు లక్ష ఓట్లను జాబితాలో చేర్చకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. అధికారులు ఇంటింటికీ వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. దొంగ ఓట్ల తొలగింపును స్వాగతిస్తామని, నిజమైన ఓటర్ల హక్కులకు భంగం కలిగిస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఈ విషయంపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని, వారం రోజుల్లో ప్రక్రియను సరిదిద్దకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

## కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం

### బీఆర్ఎస్‌లో చేరిన మియాపూర్ యువత



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, సంక్షేమ పథకాలకు గండి పడటంతో ప్రజల జీవన ప్రమాణాలు దిగజారాయని మియాపూర్‌కు చెందిన యువజన నాయకులు విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందనే నమ్మకంతో బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్‌కు చెందిన అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో పలువురు యువకులు శనివారం కూకట్‌పల్లి క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, సీనియర్ నాయకురాలు కలిదిండి రోజా, గంగాధర్, అట్టేపల్లి పురుషోత్తం, శ్రీరాములు, దయాకర్, బాబ్జీ, కృష్ణ, వీర రమేష్, తంగెళ్ల శ్రీనివాస్, యెద్ల హరినాథ్, నాగిశెట్టి వినీత్, ప్రశాంత్, అజయ్, శ్రీనివాస్‌గౌడ్, హనీఫ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపన్నులకు అండగా సీఎం సహాయనిధి



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి): తీవ్ర అనారోగ్యంతో వైద్య ఖర్చులు భరించలేక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తుందని కాంగ్రెస్ నాయకుడు బండి రమేష్ అన్నారు. స్థానికులు వైద్య సాయం కోసం చేసిన విజ్ఞప్తులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో మొత్తం రూ.3,32,500 ఆర్థిక సహాయం మంజూరైందని తెలిపారు. శనివారం హేమదుర్గ భవన్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో పొట్టేటి గౌతమి, గౌసియా బేగం, తమ్మిరి కృష్ణవేణి, దేవుళ్ల నీలం రాజు, మండల చంద్రకళలకు రూ.60 వేల చొప్పున, కడిపప్పుల్ ఫ్రాన్సిస్‌కు రూ.42,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కష్టకాలంలో ప్రభుత్వం అండగా నిలవడంపై లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, నాగార్జున, శివచౌదరి, నలినీకాంత్, వరుణ్, జహంగీర్, సంధ్య, జోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే లక్ష్యంగా స్మార్ట్ రేషన్ కార్డులు

### ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి): పేదల ఆకలి తీర్చడంతో పాటు నాణ్యమైన సన్నబియ్యం అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని గోదాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఏఎస్ఓ కళ్యాణ్, మాజీ కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నె శ్రీనివాసరావులతో కలిసి ఆయన పాల్గొన్నారు. నియోజకవర్గంలో మొత్తం 94,482 స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డు అందే వరకు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత పెంచేందుకు QR కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డులను ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. జనాభా ప్రాతిపదికన రేషన్ దుకాణాలను పెంచుతామని, కొత్తగా అర్హత పొందిన వారు మీ–సేవలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎల్లమ్మబండలో త్వరలో మహిళా పెట్రోల్ బంక్, మహిళా భవనం ఏర్పాటు చేస్తామని, శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని గాంధీ తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, డీలర్లు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు

# కాలుష్యానికి చెక్.. మట్టి గణేశుడికి స్వాగతం!

### నాగారం డివిజన్‌కు 1,450 మట్టి విగ్రహాలు.. మున్సిపల్ కార్యాలయంలో పంపిణీ

నాగారం, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి):గణేష్ చతుర్థి సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మట్టి గణేశ విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నాగారం డివిజన్‌కు 1,450 మట్టి గణేశ విగ్రహాలు చేరాయి. వీటిని నాగారం డివిజన్ మున్సిపల్ కార్యాలయంలో ప్రజలకు పంపిణీ చేశారు.మట్టి గణేశ విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని అధికారులు పేర్కొన్నారు. కాలనీ వాసులు, ప్రజలు మట్టి విగ్రహాలను స్వీకరించి పర్యావరణహితంగా గణేష్ ఉత్సవాలను నిర్వహించాలని కోరారు.

**పర్యావరణహిత గణేష్ ఉత్సవాలకు కాంగ్రెస్ పిలుపు**

మట్టి గణేశ విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది.ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమయ్య యాదవ్, మాజీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, మాజీ కౌన్సిలర్ పంగ హరిబాబు, గూడూరు అశోక్ గౌడ్, ర్యాల అశోక్ యాదవ్, చిన్నంరాజు సతీష్ గౌడ్, దాసోహం నర్సింగ్ రావు (చిన్న), ర్యాల అనిల్ యాదవ్, కౌకుట్ల శ్రీనివాస్ రెడ్డి, అన్నంరాజు సురేష్, ర్యాల బాలు యాదవ్, ర్యాల సన్నీ యాదవ్, కే. రవి పాల్గొన్నారు.




# మెదక్ నూతన ఎస్సీ మోర్చా జిల్లా కమిటీ నియామకం

### గురు రవిదాస్ మహారాజ్ 650వ జయంతి మట్టి కలశ యాత్రకు శ్రీకారం

రామాయంపేట, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి రాజాగౌడ్): భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా మెదక్ జిల్లా కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు, దంతేపల్లి సర్పంచ్ మస్కూరి బాలరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు కాంతి కిరణ్ ఆదేశాలు, రాష్ట్ర ఇన్‌చార్జి సురేఖ సూచనల మేరకు 35 మందితో నూతన జిల్లా కమిటీని ఏర్పాటు చేసినట్లు నాయకులు తెలిపారు. సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యం ఇస్తూ 8 మంది మహిళలు, 26 మంది పురుషులకు అవకాశం కల్పించామని పేర్కొన్నారు. నూతన సభ్యులకు నియామక పత్రాలు అందజేసి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. గురు రవిదాస్ మహారాజ్ 650వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర పార్టీ నుంచి తీసుకొచ్చిన పవిత్ర మట్టి కలశాన్ని జిల్లా పార్టీకి అందజేశారు. జిల్లా కేంద్రం నుంచి మండలాలు, గ్రామాల వారీగా మట్టి కలశ యాత్ర నిర్వహించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గురు రవిదాస్ మహారాజ్ సమానత్వం, సామాజిక సమరసత, సోదరభావం కోసం చేసిన బోధనలు స్ఫూర్తిదాయకమని



నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, రాష్ట్ర నాయకుడు ప్రణయ్‌కుమార్, జిల్లా నాయకులు, మోర్చా అధ్యక్షులు, మండల అధ్యక్షులు, శక్తికేంద్రాల ఇన్‌చార్జీలు, బూత్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చదువుపై పట్టుదల... జగ్గారెడ్డి నుంచి భరోసా

**పది రోజులు శ్రమించి జగ్గారెడ్డి చిత్రపటం తయారీ**

**రెండున్నర ఎకరాల భూమి సమస్య పరిష్కరించాలని వినతి**

**కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరిస్తానన్న జగ్గారెడ్డి**

సంగారెడ్డి, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి) : కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో మధ్యలో నిలిచిపోయిన చదువును తిరిగి కొనసాగించాలనే పట్టుదలతో ఓ విద్యార్థిని వినూత్నంగా తన సమస్యను జగ్గారెడ్డి దృష్టికి తీసుకెళ్లింది. రాయికోడ్ మండలం కప్పాడ్ గ్రామానికి చెందిన భవాని పది రోజుల పాటు శ్రమించి థ్రెడ్ ఆర్ట్‌తో జగ్గారెడ్డి చిత్రపటాన్ని రూపొందించి ఆయనకు బహూకరించింది.భవాని మోడల్ స్కూల్‌లో విద్యనభ్యసించి ప్రస్తుతం అసోసియేటెడ్ చార్టర్డ్ సర్టిఫైడ్ అకౌంటెంట్ (ACCA) కోర్సు చదువుతోంది. ఇప్పటికే ఫస్ట్ లెవల్ పూర్తి చేసిన ఆమె కుటుంబ ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఆరు నెలలుగా చదువుకు దూరంగా ఉంటోంది.తల్లిదండ్రులకు చెందిన రెండున్నర ఎకరాల భూమి గత 12 సంవత్సరాలుగా వివాదంలో ఉండటంతో కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. రెవెన్యూ అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్న



భూమి సమస్య పరిష్కారమైతే తన చదువును కొనసాగించవచ్చని భావించిన భవాని జగ్గారెడ్డిని కలవాలని నిర్ణయించుకుంది.చిన్నప్పటి నుంచి ఆర్ట్‌పై ఆసక్తి ఉన్న భవాని ఇంటర్నెట్ ద్వారా థ్రెడ్ ఆర్ట్ నేర్చుకుని, పది రోజుల పాటు శ్రమించి జగ్గారెడ్డి చిత్రపటాన్ని రూపొందించింది. చేర్యాల ఆంజనేయులు, చిమ్నాపూర్ ప్రకాష్, పాస్టర్ మోజెస్ సహకారంతో తల్లిదండ్రులతో కలిసి జగ్గారెడ్డిని కలిసింది.తన చదువు, కుటుంబ పరిస్థితి, భూమి సమస్యను ఆయనకు వివరించింది. దీనిపై స్పందించిన జగ్గారెడ్డి సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో మాట్లాడి భూమి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. చదువును మధ్యలో ఆపకుండా లక్ష్యం వైపు ముందుకు సాగాలని భవానిని ప్రోత్సహించారు.

## వెలుగులు పంచుతున్న కౌకుట్ల జీవన్ రెడ్డి

### పలు కాలనీలకు వీధి దీపాలు.. గణేష్ మండపాలకు ప్రత్యేక లైట్ల అందజేత





నాగారం, సెప్టెంబర్ 12,(నవజ్యోతి ప్రతినిధి) :నాగారం డివిజన్‌లో కాంగ్రెస్ నాయకుడు కౌకుట్ల జీవన్ రెడ్డి పలు కాలనీలకు వీధి దీపాలను విరాళంగా అందజేశారు. రాత్రివేళల్లో ప్రజలకు మెరుగైన వెలుతురుతో పాటు భద్రత కల్పించేందుకు అవసరమైన ప్రాంతాలను గుర్తించి వీధి దీపాలను అందించారు. అదేవిధంగా వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణేష్ మండపాలకు ప్రత్యేకంగా లైట్లను అందజేశారు. మండపాల వద్ద భక్తులు, స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గణేష్ ఉత్సవాలను సౌకర్యవంతంగా నిర్వహించుకునేందుకు లైట్లను అందించినట్లు తెలిపారు. కాలనీల్లో చీకటి సమస్యను తగ్గించి ప్రజలకు మెరుగైన వెలుతురు, భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కౌకుట్ల జీవన్ రెడ్డి తెలిపారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో తన వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమయ్య యాదవ్, కాంగ్రెస్ నాయకులు వంగేటి పర్వత్ రెడ్డి,సోమిరెడ్డి, శ్రీశైలం, దొడ్డి నరసింహ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



కూకట్‌పల్లి, సెప్టెంబర్ 12 (నవజ్యోతి ప్రతినిధి) :పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా బసంతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అజయ్ రాయుడు చేతుల మీదుగా కూకట్ పల్లి రామాలయం వద్ద సుమారు 500 మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసాయనాలతో కూడిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వల్ల జలాశయాలు కలుషితమవుతాయని, వాటికి బదులుగా సహజసిద్ధమైన మట్టి విగ్రహాలనే పూజించాలని కోరారు. పర్యావరణహిత వినాయక చవితిని జరుపుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత పెద్దఎత్తున ముందుకు వచ్చి మట్టి విగ్రహాల వినియోగంపై సమాజంలో చైతన్యం తీసుకురావాలని, ప్రకృతిని కాపాడే బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములు కావాలని అజయ్ రాయుడు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానికులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకుల పంపిణీ అభినందనీయం

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి.. ఏనుగు సుదర్శన్‌రెడ్డి

**చెంగిచెర్ల, సెప్టెంబర్ 12,(నవజ్యోతి ప్రతినిధి):**
పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించడం ద్వారా ప్రకృతిని కాపాడుకోవచ్చని మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచెర్ల డివిజన్ ఆర్టీసీ కాలనీలో చార్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీజేవైఎం రాష్ట్ర నాయకుడు బండారు పవన్‌రెడ్డితో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలను వినియోగించడం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందన్నారు. మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో తమ వంతు బాధ్యతగా మట్టి వినాయకులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా చార్విక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మేఖల మహేందర్‌రెడ్డి పరిసర ప్రాంతాల్లో మానసిక వైకల్యంతో బాధపడుతున్న పిల్లలకు ఉచిత శిక్షణతో పాటు విద్య, వైద్య సేవలు అందించడం అభినందనీయమని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. సమాజం నుంచి ఆశించడం కంటే సమాజం కోసం సేవ చేయాలనే స్ఫూర్తితో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆదర్శనీయమన్నారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో చార్విక్ ఫౌండేషన్ ప్రతినిధులు, బీజేపీ నాయకులు, స్థానిక నాయకులు, భక్తులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## గంగపుత్ర కాలనీలో సందర్శించిన మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి



**అల్వాల్/సెప్టెంబర్ 12, (నవజ్యోతి ప్రతినిధి):**
అల్వాల్ సర్కిల్ పరిధిలోని గంగపుత్ర కాలనీని మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి శనివారం నాయకులతో కలిసి సందర్శించారు.ఆమె కాలనీలోని సమస్యలను గుర్తించి అక్కడ కొత్త మురుగునీటి పైప్ లైన్ వేయడం,చెట్టు కొమ్మలను నరకడం,సిసి రోడ్ల నిర్మాణానికి సంబంధించిన సమస్యలను పరిశీలించారు.ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు.అనంతరం మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి కొత్తబస్తీ కమ్యూనిటీ హాల్ లో బస్తీ ప్రజలకు మట్టి గణేష్ విగ్రహాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రేమ్ కుమార్ అరుణ్ మహేందర్,గిరి,ప్రశాంత్ లింగారెడ్డి,సాజిద్,అభి ప్రశాంత్,మహేష్,అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## మిస్సింగ్ / కనబడుటలేదు

**దివ్యవాణి ఆచూకీ కోసం పత్రికా ప్రకటన**



| | |
|---|---|
| పేరు | : దివ్యవాణి |
| వయస్సు | : 33 సంవత్సరాలు |
| తండ్రి పేరు | : మధుసూదన్ |
| భర్త పేరు | : అరవింద్ |
| మిస్సింగ్ తేదీ | : సెప్టెంబర్ 11 |

**చివరిగా చూసిన ప్రదేశం (లాస్ట్ సీన్) : బిక్కనూరు**

**ఈమె ఆచూకీ తెలిసినవారు వెంటనే క్రింది నంబర్లకు తెలియజేయగలరు :**

☎ 9440888645 ☎ 6281553631 ☎ 7032778965

సహాయం చేయండి • సరైన సమాచారం అందించిన వారికి కృతజ్ఞతలు తెలియజేయబడును

## కేఫ్ లియోరా గ్రాండ్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

### ప్రజలకు నాణ్యమైన సేవలు అందించి మంచి పేరు సంపాదించాలి: ఎమ్మెల్యే



**కుషాయిగూడ, సెప్టెంబర్12,(నవజ్యోతి ప్రతినిధి) :**
ఈసీఐఎల్ ఎక్స్ రోడ్డులోని కమలా నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కేఫ్ లియోరా గ్రాండ్ ఓపెనింగ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కేఫ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కేఫ్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలతో పాటు టీ, కాఫీ తదితర సేవలను అందిస్తూ మంచి పేరు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు.యువత, కుటుంబ సభ్యులు, స్నేహితులు ఆహ్లాదకరమైన వాతావరణంలో కొంత సమయం గడిపేందుకు అనువైన ప్రదేశంగా కేఫ్ లియోరా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే అన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తూ వ్యాపారంలో విజయవంతంగా ముందుకు సాగాలని నిర్వాహకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కేఫ్ నిర్వాహకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

### పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్, సెప్టెంబర్ 12, (నవజ్యోతి ప్రతినిధి) :**
పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ లక్ష్యంగా ఉప్పల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల నిమజ్జనం కారణంగా నీటి వనరులు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, అందువల్ల మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని తెలిపారు. సంప్రదాయాలను కొనసాగిస్తూనే ప్రకృతిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. యువత, మహిళలు, గణేష్ ఉత్సవ కమిటీలు, కాలనీ సంక్షేమ సంఘాలు పర్యావరణహిత గణేష్ ఉత్సవాల నిర్వహణలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి. వెంకటరామిరెడ్డి, ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వి. తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి. శివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ పి. సాగర్, ఉపాధ్యక్షులు ఏవి. శ్రీధర్‌రావు, కే. నరోత్తమరెడ్డి, కోశాధికారి గుత్తి శేఖర్, జాయింట్ సెక్రటరీ డి. రాజు, సీనియర్ జర్నలిస్టులు కొలనుపాక చంద్రమౌళి, పి. మహేందర్‌రెడ్డి, మండల శ్రీశైలం తదితర జర్నలిస్టులు, గణేష్ ఉత్సవ నిర్వాహకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.



## జ్యూట్ బ్యాగులతో పర్యావరణహిత వినాయక విగ్రహం

### త్రివేణి స్కూల్‌లో ఘనంగా వినాయక చవితి వేడుకలు



**పటాన్చెరు, సెప్టెంబర్ 12(నవజ్యోతి ప్రతినిధి):**
బీరంగూడ కమాన్ వద్ద గల త్రివేణి స్కూల్‌లో వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై బాధ్యతను పెంపొందించే ఉద్దేశంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. వేడుకల్లో డైరెక్టర్ వీరేంద్ర చౌదరి, సీఆర్ఓ సాయి నరసింహారావు, ప్రిన్సిపల్ భవాని, క్యాంపస్ ఇన్‌చార్జ్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జ్యూట్ బ్యాగులతో రూపొందించిన పర్యావరణహిత వినాయక విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ప్లాస్టిక్ వంటి పర్యావరణానికి హానికరమైన పదార్థాలకు బదులుగా సహజసిద్ధమైన జ్యూట్‌ను వినియోగించి చిన్నారులు వినూత్నంగా విగ్రహాన్ని రూపొందించారు. పండుగను ఆనందంగా జరుపుకోవడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా అందించారు. విద్యార్థుల కోసం పాటలు, నృత్యాలు, సాంస్కృతిక, వినోదాత్మక కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. తల్లిదండ్రులు కార్యక్రమాన్ని ఆసక్తిగా వీక్షించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ చిన్న వయసు నుంచే విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ, బాధ్యతాయుతమైన జీవన విధానం, భారతీయ సంస్కృతిపై గౌరవాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పండుగలను ఆనందంగా జరుపుకోవడంతో పాటు ప్రకృతిని కాపాడే విధానాలను అలవర్చుకోవాలని సూచించారు.

## మట్టి వినాయకుడితో పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం

### జాహిద్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విగ్రహాల పంపిణీ

### పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ మనందరి బాధ్యత: బన్నాల ప్రవీణ్ ముదిరాజ్

**ఉప్పల్, సెప్టెంబర్ 12,(నవజ్యోతి ప్రతినిధి) :**
ఉప్పల్ జోన్ బీరప్ప గడ్డ డివిజన్‌లోని జాహిద్ నగర్ కాలనీలో జాహిద్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై కాలనీ వాసులకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల నిమజ్జనం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. సంప్రదాయాన్ని కాపాడుతూ ప్రకృతిని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాలని కోరారు. ముఖ్యంగా యువత, మహిళలు, గణేష్ ఉత్సవ కమిటీలు, కాలనీ సంక్షేమ సంఘాలు పర్యావరణహిత గణేష్ ఉత్సవాల నిర్వహణలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాహిద్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సునీల్ కుమార్, ఫరూక్, శ్రీకాంత్ రెడ్డి, తిరుపతి రెడ్డి, నరేందర్ నాయక్, మీనేష్, శ్రీకాంత్ గౌడ్, ముజీబ్ మీరజ్, రాజ్ కుమార్, పద్మజ, ప్రసన్నలక్ష్మి, సంతోషిని, గణేష్ ఉత్సవ నిర్వాహకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీ వాసులు, భక్తులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

